క్లుప్తంగా

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి



చెన్నూర్: రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ కోటేశ్వర్‌రావు

చెన్నూర్: వైద్యులు, సిబ్బంది రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందించాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ జిల్లా కో ఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ కోటేశ్వర్‌రావు అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, ఔట్ పేషెంట్ వివరాలను పరిశీలించారు. వార్డుల్లో చికిత్సలు పొందుతున్న రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు ఎలా ఉన్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. డీసీహెచ్‌ఎస్ మాట్లాడుతూ ఆసుపత్రిలో డెలివరీల సంఖ్యను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

నోటీసులకు స్పందించాలి

లక్సెట్టిపేట: 63వ జాతీయ రహదారిలో భూములు కోల్పోతున్న రైతులు రెవెన్యూ కార్యాలయం నుంచి అందించిన నోటీసులకు ఈ నెల 20వ తేదీ లోపు స్పందించాలని తహసీల్దార్ దిలీప్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రికార్డులో ఉన్నవిధంగా భూమిలో అభ్యంతరాలు ఉంటే వాటిని పరిశీలించనున్నట్లు తెలిపారు. యాజమానులు కార్యాలయానికి వచ్చేటప్పుడు ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, పట్టాపాస్ పుస్తకాలు తీసుకు రావాలని రికార్డు ప్రకారం పరిహారం అందుతుందని తెలిపారు.


టీపీఏ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న టీపీఏ నూతన కార్యవర్గ సభ్యులు

మంచిర్యాలటౌన్: తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్(టీపీఏ) జిల్లా నూతన కమిటీ కార్యవర్గాన్ని గురువారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నారాయణరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చెరకు శశికిరణ్‌లు ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షుడిగా రంగు వేణుకుమార్, ప్రధాన కార్యదర్శి సుమన చైతన్య, వైస్ ప్రెసిడెంట్ సీహెచ్ మొగిలి, రజిత, ట్రెజరర్ సమ్మయ్య, జాయింట్ సెక్రటరీగా సృజన మోహన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా తాళ్లపల్లి కవిత, దీప్తి కిరణ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో టీపీఏ జిల్లా గౌరవ సలహాదారు పద్మ చరణ్, జిల్లా పూర్వ అధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మాల సంఘం నాయకుల ముందస్తు అరెస్ట్



చెన్నూర్‌లో అరెస్టైన నాయకులు

జైపూర్/లక్సెట్టిపేట/చెన్నూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర కమిటీ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చింది. గురువారం తలపెట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌కు తరలివెళ్తున్న చెన్నూర్, లక్సెట్టిపేట, జైపూర్, లక్సెట్టిపేట మండలాలకు చెందిన మాల మహానాడు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అరెస్టైన వారిలో మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోగాల కృష్ణయ్య, తదితర నాయకులు ఉన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

లక్సెట్టిపేట: క్రిస్మస్‌ను పురస్కరించుకొని మండల కేంద్రంలోని సీఎస్ఐ రైడల్ పాఠశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు.

అడ్డూఅదుపు లేని దుబారా

- పర్యవేక్షణ లేకపోవడంతో పెరుగుతున్న ఖర్చులు
- అదనపు ఆదాయంపై దృష్టిసారించని సింగరేణి అధికారులు
- గాడి తప్పుతున్న 'మందమర్రి ఏరియా'



మందమర్రి ఏరియాలోని మూడో జోన్‌లో గల శిథిలావస్థకు చేరిన సింగరేణి క్వార్టర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో సింగరేణి సంస్థ అడ్డూఅదుపు లేని దుబారా ఖర్చుల వల్ల నష్టాల్లో కొనసాగుతోంది. ఆ ఖర్చులను తగ్గించుకోవాల్సిన అధికారులు వాటి పై దృష్టి సారించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఏరియా మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ దృష్టి సారిస్తే నష్టాలు తగ్గే అవకాశాలున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సూచనలు ఇవే...

- గనులపైనే కాకుండా వర్క్‌షాప్, స్టోర్స్ తదితర ఏరియాల్లో ఎక్కడపడితే అక్కడ వినియోగించి తొలగించిన స్క్రాప్ పేరుకు పోయింది. దానిని విక్రయిస్తే రూ.కోట్లలో ఆదాయం సమకూరుతుంది. అలాంటి సొత్తు విక్రయించకపోవడంతో దొంగల పాలవుతుంది. పలుచోట్ల కుప్పగా మిగిలి ఉన్న బొగ్గు షేలు, చూరను కూడా టెండర్ ద్వారా విక్రయిస్తే రూ.కోట్లలో ఆదాయం వచ్చే అవకాశం ఉంది.
- రూ.కోట్లలో పేరుకుపోయిన క్వార్టర్ల అద్దె బకాయిలు వసూలు చేయాలి.
- ఇష్టారీతిగా వేలాది సింగరేణి క్వార్టర్లు కబ్జాకు గురైనప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. వాటికి సంస్థ నుంచి రూ.లక్షల్లో విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా వేలాది క్వార్టర్లు శిథిలావస్థకు చేరినప్పటికీ సింగరేణి సంస్థ వాటిని కూల్చివేయలేదు. వాటికి రూ.లక్షల్లో ప్రాపర్టీ టాక్స్ చెల్లిస్తోంది. ఏరియాలోని అనవసరపు విద్యుత్ ఖర్చులు, ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లింపులు నియంత్రించాలి.
- ఏరియాలో డిప్యూటేషన్‌లు, ఫ్రీ మస్టర్లు, ఇతర షిఫ్టుల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులను జనరల్ షిఫ్ట్‌లోకి తీసుకోరాదనే నిబంధనలు ఉన్నాయి. ఇందుకు విరుద్ధంగా యూనియన్‌ల ప్రతినిధులకు అక్రమంగా డిప్యూటేషన్‌లు, ఉచిత మస్టర్లు ఇస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వీటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి.

నష్టాన్ని పూడ్చడానికి ప్రత్యేక చర్యలు..



మందమర్రి ఏరియాలో నష్టాన్ని పూడ్చడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఏరియాలోని గనుల్లో బొగ్గు ఉత్పత్తి పెంచేలా పని స్థలాల్లో మిషనరీలను రోజుకు సుమారు 19గంటలు వాడుకుంటున్నాం.బొగ్గు ఉత్పత్తి చేసే క్రమంలో ఓబీ కలువకుండా చర్యలు చేపడుతున్నాం. పని జరిగే స్థలాల్లో అడ్వాన్స్‌గా బొగ్గు రవాణకు సంబంధించిన మెటీరియల్ అందుబాటులో ఉంచుకోవడం, కబ్జాకు గురైన క్వార్టర్లకు విద్యుత్, వాటర్ సరఫరా కట్ చేయడం, అద్దె క్వార్టర్ల బకాయిదారులకు నోటీసులు అందించి వసూలు చేయడం లాంటి ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.

– దేవేందర్, ఏరియా జీఎం

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం



ఇరుకు గదిలో బోధిస్తూ..



దండేపల్లి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-2కు, పక్కా భవనం లేక ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలోని ఓ పాత భవనంలో కొన్నేళ్లపాటు నిర్వహించారు. ఆ భవనం శిథిలావస్థకు చేరడంతో కొత్త భవనానికి రెండేళ్ల క్రితం నిధులు మంజూరయ్యాయి. పాత భవనాన్ని తొలగించి దాని స్థానంలో కొత్త భవనం పనులు చేపట్టారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రాథమిక పాఠశాలలోని ఓ ఇరుకు గదిలో నిర్వహిస్తున్నారు. గదిలో విద్యార్థులకు ఆటపాటలతో బోధన చేయడంతో పాటు, అంగన్‌వాడీ సామగ్రి అంతా అదే గదిలో ఉండటంతో ఇరుకుగా ఉంది. అది కూడా శిథిలావస్థకు చేరింది. అంగన్‌వాడీ కొత్త భవన నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. రెండేళ్లు గడిచినా పనులు పూర్తికాక పోవడంతో, ఇరుకైన శిథిల భవనంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహించేదుకు ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు స్పందించి అంగన్‌వాడీ కొత్త భవనం నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయించాలని పలువురు కోరుతున్నారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం



బెల్లంపల్లి: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

పాతమంచిర్యాల/తాండూర్/చెన్నూర్/లక్సెట్టిపేట/బెల్లంపల్లి/కాసిపేట: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో అనుచితంగా మాట్లాడారని నిరసిస్తూ గురువారం జిల్లా వ్యాప్తంగా నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా, బస్టాండ్ ఏరియాలో ప్రజాసంఘాల నాయకులు, బెల్లంపల్లిలో మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో, చెన్నూర్‌లో కొత్త బస్టాండ్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించి దిష్టిబొమ్మ దహనం చేశారు. తాండూర్ మండలం కాసిపేట గ్రామంలో, కాసిపేట మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. లక్సెట్టిపేటలో అంబేడ్కర్, మాలమహానాడు సంఘం నాయకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు.

గురుకులాన్ని ఆకస్మికంగా సందర్శించిన డీఈవో

- నాణ్యమైన విద్యాబోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచన



గురుకులాన్ని పరిశీలిస్తున్న డీఈవో యాదయ్య

తాండూర్: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే బాలుర గురుకుల విద్యాలయాన్ని గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈవో) యాదయ్య ఆకస్మికంగా సందర్శించారు. ప్రిన్సిపాల్ అందుబాటులో లేకపోవడంతో యాదయ్య అసంతృప్తి వ్యక్తం చేశారు. గురుకుల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎల్లవేళలా ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం చేసిన మార్గదర్శకాల ప్రకారం మెనూ అమలు చేయాలని, నాణ్యమైన విద్యను బోధించాలని సూచించారు. గురుకులంలోని వసతులు, తరగతి గదులు, కిచెన్, స్నానాల గదులు, మరుగుదొడ్లను ప్రత్యేకంగా పరిశీలించారు. జ్యోతిబా పూలే గురుకులాన్ని సంక్షేమ బాలుర వసతి గృహంలోకి మార్చే అవకాశాలను పరిశీలించిన డీఈవో, పూర్తిస్థాయిలో నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానని పేర్కొన్నారు. డీఈవో వెంట ఎంఈవో మల్లేశం, సమగ్ర శిక్షా క్వాలిటీ కో ఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి, పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మంజుల, ఉపాధ్యాయులు ఉన్నారు.

సులభ్ కార్మికుల వేతనాలు పెంచాలి



ఆందోళన చేస్తున్న ఇఫ్టూ నాయకులు

బెల్లంపల్లి: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సులభ్ కార్మికుల వేతనాలను పెంచాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి తిలక్ స్టేడియంలో గురువారం నిర్వహించిన సులభ్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏళ్ల తరబడి నుంచి వేతనాలు పెరగక సులభ్ కార్మికులు తీవ్ర వేదనకు గురవుతున్నారని, చాలీచాలని బ్రతుకులు వెల్లదీస్తున్నారని పేర్కొన్నారు. కార్మికులకు బోనస్, ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఈ నెల రావాల్సిన వేతనాన్ని వెంటనే కార్మికుల వ్యక్తిగత బ్యాంకుఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు తీర్చకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు జాఫర్, అరుణ, సులభ్ కార్మికులు భూమయ్య, శ్రీనివాస్, ఈశ్వరి, శకుంతల, వెంకటస్వామి, లత, రాజేష్ ఖన్నా, దుర్గయ్య, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో ఉత్పాదకత పెంచుకోవాలి

- ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ



కార్మికులతో మాట్లాడుతున్న ఎస్‌ఓటు జీఎం

శ్రీరాంపూర్: ఉద్యోగులు, అధికారులు సమష్టిగా కృషి చేసి ఉత్పాదకతను పెంచాలని మల్టీడిపార్ట్‌మెంటల్ కమిటీ కన్వీనర్, ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ తెలిపారు. శ్రీరాంపూర్‌లోని ఎస్ఆర్పీ 1, ఎస్ఆర్పీ 3 గనులపై మంగళవారం మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలన్నారు. అంకితభావంతో పనిచేసి కంపెనీ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. ఉత్పత్తి ఖర్చును తగ్గించుకోవడానికి యంత్రాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో గ్రూప్ 2 మైన్స్ కన్వీనర్ రాజేందర్, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ ఎస్కే బాజీసైదా, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, గ్రూప్ ఏజెంట్ వెంకటేశ్వర్లు, రెండు గనుల మేనేజర్లు వెంకట్రావు, విజయకుమార్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, ఎస్‌ఈ(ఐఈడీ) కిరణ్ కుమార్, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర రెడ్డి, అడిషనల్ మేనేజర్ అమర్నాథ్ సంక్షేమ అధికారులు గౌస్ పాషా, సాధన్ ఫిట్, ఫిట్ సెక్రటరీలు రాజయ్య, మురళి చౌదరి పాల్గొన్నారు.

సింగరేణి డే వేడుకల ఏర్పాట్ల పరిశీలన

శ్రీరాంపూర్: ఈ నెల 23న ప్రగతి మైదానంలో జరిగే సింగరేణి ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లను ఏరియా జీఎం ఎల్వీ సూర్యనారాయణ పరిశీలించారు. మైదానంను గురువారం ఆయన సందర్శించి ఏర్పాట్లపై ఉన్నతాధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని సౌకర్యాలు కల్పించాలని, వేదికను అందంగా ముస్తాబు చేయాలని ఆదేశించారు.

బ్లడ్ క్యాంపులు నిర్వహించాలని వినతి

శ్రీరాంపూర్: జిల్లాలోని తలసేమియా, సికిల్స్ సెల్ వ్యాధిగ్రస్తులను ఆదుకోవడం కోసం సింగరేణి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ కోరారు. సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి జీఎం కార్యాలయంలో గురువారం జీఎంను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. గతంలో శ్రీరాంపూర్ వీటీసీలో అనేక మార్లు రక్తదాన శిబిరాలు నిర్వహించినట్లు గుర్తు చేశారు. యువ కార్మికులకు రక్తదాన ప్రాముఖ్యతను వివరించి వారు రక్తదానానికి ముందుకొచ్చేలా చేయాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

కాంట్రాక్ట్ కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

శ్రీరాంపూర్: తమ వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ కృష్ణ కాలనీలోని సివిల్ కార్యాలయం వద్ద గురువారం సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు ప్లకార్డులు చేతబూని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మానందం మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19, 20, 21తేదీల్లో కంపెనీ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. గడిచిన 10సంవత్సరాలుగా కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెరుగలేదన్నారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం వేతనాలు పెంచుతామని మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి, నేడు సంవత్సరం అవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కోలిండియాలో జరిగిన ఒప్పందాలను సింగరేణిలో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు కిరణ్, ఈశ్వర్, రాజయ్య, తిరుపతి, శ్రీనివాస్, గౌరమ్మ, మేరీ రాజేశ్వరి పాల్గొన్నారు.

సమన్వయంతో ఇందిరమ్మ ఇళ్ల సర్వే



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

జైపూర్: జిల్లాలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేప్రక్రియను అధికారులు సమన్వయంతో గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ తెలిపారు. జైపూర్ మండల కేంద్రంతోపాటు వెంకట్రావుపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. దరఖాస్తుదారుల వివరాలను ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, స్థానిక పంచాయితీ కార్యదర్శి ఉదేయ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కారించాలని ఎస్టీయూటీఎస్ ప్రతినిధులు గురువారం డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, బాపు ఆధ్వర్యంలో డీఈవో యాదయ్యను సన్మానించారు. చలి తీవ్రత నేపథ్యంలో విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని పాఠశాలల సమయాన్ని ఉదయం 9.40 నుంచి సాయంత్రం 4.30 గంటలకు మార్చాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఉప విద్యాధికారి పీఏవీఎస్ చారి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీపీపీలో క్యాంటీన్ ప్రారంభం



వెల్‌బేబీ షోలో పాల్గొన్న చిన్నారులు, అధికారులు

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు(ఎస్టీపీపీ)లో ఈడీ రాజశేఖర్‌రావు, వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్ క్యాంటీన్‌ను పునః ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీఎం శ్రీనివాసులు, ఏఐటీయూసీ ఫీట్ సెక్రెటరీ సత్యనారాయణ, సీఎంవోఏఐ ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాస్, పవర్‌మేక్ ప్లాంటు హెడ్ అఖిల్‌కపూర్, ఏజీఎంలు, సుధాకర్, మధన్‌మోహన్, పర్సనల్ అధికారి మోహన్‌సింగ్, కార్మిక సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డిస్పెన్సరీలో వెల్‌బేబీ షో...

పవర్ ప్లాంటులో గల డిస్పెన్సరీలో వెల్ బేబీ షో కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేటి బాలలే రేపటి పౌరులు, పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే దేశ భవిత కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. బేబీ షోలో పాల్గొన్న పిల్లలకు బీబీ కింగ్, బేబీ క్వీన్, ప్రిన్స్1, ప్రిన్స్-2 కెటగిరిలో పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు.

'రైతుల గురించి స్పందిస్తే విమర్శలా'

జన్నారం: కడెం ఆయకట్టు నీటి విడుదలపై రైతుల కోరిక మేరకు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్‌నాయక్ రైతులతో కలిసి కడెం ఆయకట్టు అధికారులకు వినతిపత్రం ఇస్తే ఓటమి భయంతో కాంగ్రెస్ నాయకులు మతి తప్పి విమర్శలు చేయడం సరికాదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం రాజరాంరెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం మాట్లాడారు. కడెం ప్రాజెక్టు ఆయకట్టు రైతులను ఉద్దేశించి కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

అధికారులు స్థానికంగా ఉండాలి

కాసిపేట: కాసిపేట ఏజెన్సీ మండలంలో విధులు నిర్వర్తించే అధికారులు ఏజెన్సీ అలవెన్స్‌లు తీసుకుంటూ స్థానికంగా ఉండకుండా సమయపాలన పాటించకుండా ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, జవహర్ బాల్ మంచ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ బీరుకూరి ప్రవీణ్‌బాబు విమర్శించారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అధికారులు స్థానికంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవచేయాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థినికి అభినందన

చెన్నూర్‌రూరల్: మండలంలోని పొక్కూరు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బి.ఐశ్వర్య జిల్లా స్థాయి జీవశాస్త్ర ప్రతిభ టాలెంట్ పరీక్షలో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కాగా గురువారం పాఠశాల హెచ్ఎం ఎం.దత్తకుమార్ రూ.వెయ్యి నగదు బహుమతి అందజేసి ఉపాధ్యాయులు అభినందించారు.

దుప్పట్ల పంపిణీ

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో గురువారం హెడ్ సొసైటీ ఆధ్వర్యంలో పేద ప్రజలకు దుప్పట్లను పంపిణీ చేశారు. మంచిర్యాల ఏఎస్ఐ సత్తయ్య ఆధ్వర్యంలో చలికి ఇబ్బందులు పడుతున్న వారికి రగ్గులు అందించినట్లు సొసైటీ ఫౌండర్లు సైమన్, కళ్యాణ్ ప్రసాద్, శ్రీనివాస్, రాగమాలిక తెలిపారు.

ఘనంగా కృష్ణస్వామి ముదిరాజ్ వర్ధంతి

జన్నారం: మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముదిరాజ్ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రముఖ రచయిత, జర్నలిస్టుగా కృష్ణస్వామి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో దండవేణి చంద్రమౌళి, శ్రీధర్, ఐలవేణి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఓటుహక్కు తొలగించేందుకు కుట్ర'

కాసిపేట: ఓటుహక్కు తొలగించేందుకు అగ్రవర్ణ కాంగ్రెస్ నాయకుడు కుట్ర చేస్తుంటే స్థానిక తహసీల్దార్ అతడికి వత్తాసు పలుకుతున్నట్లు గిరిజనుడు, మాజీ సర్పంచ్ జాదవ్ గజానంద్ ఆరోపించారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడారు. మండలంలోని ధర్మరావుపేటకు చెందిన గిరిజనుడిని అయిన తనపై, అగ్రవర్ణ కాంగ్రెస్ నాయకుడు ఓటు హక్కును తొలగించేందుకు కుట్ర చేస్తున్నాడన్నారు. తహసీల్దార్ ఓటుహక్కు తీసివేస్తామని నోటీసులు పంపుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఓటు తొలగించాలని చూడటం సరికాదని, ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుడిపై కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతుంటే అధికారులు అతడి మాట వినడం సరికాదన్నారు. వెంటనే ప్రజాస్వామ్యంలో ఇచ్చిన ఓటును కల్పించాలన్నారు. లేనట్లయితే ఆందోళన చేయనున్నట్లు తెలిపారు.

25మందికి కంటి ఆపరేషన్లు

చెన్నూర్: మండలంతో పాటు మహాదేవపూర్ మండలం పలుగుల గ్రామానికి చెందిన 25మంది నిరుపేదలకు బండారి రాజేశ్వరి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు గురువారం ఉచిత కంటి ఆపరేషన్లు, చికిత్స నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు అభిషేక్ చిందం, రాజేశ్వరి చారిట్రబుల్ ట్రస్ట్ ఫౌండర్ బండారి లక్ష్మణ్, వైద్య బృందం, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

నియామకం

చెన్నూర్: పట్టణానికి చెందిన గుండెటి మధుకు తెలంగాణ పద్మశాలీ సంఘం రాష్ట్ర కమిటీలో చోటు దక్కింది. రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో మంచిర్యాల జిల్లా నుంచి చెన్నూర్ పట్టణానికి చెందిన గుండెటి మధును రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా నియమించారు.